కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల వేతనాలు పెంచండి

జల మండలి ఎండీ సుదర్శన్ రెడ్డికి యూనియన్ నేతల వినతిపత్రం

సిటీబ్యూరో, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : జలమండలిలో పనిచేసే కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు వెంటనే కేటగిరీ 1 నుంచి కేటగిరి 2లోకి మార్చి జీతాలు పెంచాలని కోరుతూ మంగళవారం జలమండలి కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఎండీ సుదర్శన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. గతంలో జీవో 11 నుండి జీవో 60లోకి మార్చిన సందర్భంగా చాలా మంది కార్మికులు జీవో 60లో కేటగిరి2లో పొందుపర్చాల్సింది కేటగిరి 1లో పొందు పర్చడం వల్ల కార్మికులకు తక్కువ వేతనం వస్తుందన్నారు. బోర్డులో అధికారుల తప్పిదాలతో వందలాది మంది కార్మికులకు అన్యాయం జరుగుతుందన్నారు.

పలు కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 16: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పలు కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ పరీక్షల విభాగం, కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. మూడేండ్ల ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఆరో సెమిస్టర్, ఐదేండ్ల బీఏ - ఎల్ఎల్‌బీ, ఐదేండ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేండ్ల బీ కామ్ ఎల్ఎల్‌బీ పదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 29వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో వచ్చే నెల 3వ తేదీలోగా చెల్లించవచ్చన్నారు. ఎంఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును వచ్చే నెల 2వ తేదీలోగా, రూ.200 అపరాధ రుసుముతో 4వ తేదీలోగా చెల్లించాలన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

విదేశీ భాషల్లో డిప్లమా కోర్సులకు దరఖాస్తులు

ఓయూ పరిధిలో వివిధ విదేశీ భాషల్లో డిప్లమా కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఫ్రెంచ్, జర్మన్ భాషల్లో నాలుగు నెలల జూనియర్, సీనియర్ డిప్లమా కోర్సులతో పాటు ఏడాది అడ్వాన్స్‌డ్ డిప్లమా కోర్సును అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కోర్సుల తరగతులను జూలై ఎనిమిదో తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన వారు జూనియర్ డిప్లమాలో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. సీనియర్ డిప్లమాలో చేరేందుకు కనీసం యాభై శాతం మార్కులతో జూనియర్ డిప్లమా కానీ, యూజీలో సంబంధిత భాషను సెకండ్ లాంగ్వేజ్‌గా చదివి ఉండాలని చెప్పారు. అడ్వాన్స్‌డ్ డిప్లమాలో చేరేందుకు కనీసం యాభై శాతం మార్కులతో సీనియర్ డిప్లమా పాసై ఉండాలన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్ విధానంలో పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు విదేశీ భాషల విభాగం కార్యాలయంలో గాని, ఫోన్ నం.83310 41309లో గాని సంప్రదించాలని సూచించారు. దరఖాస్తులు దాఖలు చేసేందుకు జూలై 6వ తేదీ ఆఖరు అని చెప్పారు.

ఎం ఫార్మసీ పరీక్షా ఫలితాల విడుదల

ఓయూ పరిధిలో ఎం ఫార్మసీ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ప్రొ. రాములు తెలిపారు. అన్ని స్పెషలైజేషన్ల ఎం ఫార్మసీ (సీబీసీఎస్) సెమిస్టర్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు.

ఎంఈడీ జవాబు నకలు పత్రాలు పొందేందుకు..

ఓయూ పరిధిలోని ఎంఈడీ జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఎంఈడీ రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున చెల్లించి ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

భద్రత, నేరాల కట్టడిపై ప్రత్యేక దృష్టి

సైబర్ క్రైమ్, షీ టీమ్స్‌కు రివార్డులు

అన్ని విభాగాలలో పనిచేసే వారికి ప్రోత్సాహం: సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి

సిటీబ్యూరో, ఏప్రిల్ 16(నమస్తే తెలంగాణ): మహిళా భద్రత, సైబర్ నేరాలను కట్టడి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి సూచించారు. సైబర్ క్రైమ్, మహిళా భద్రతా విషయంలో షీ టీమ్స్, భరోసా విభాగాలలో వృత్తిపరమైన ప్రతిభను కనబర్చిన సిబ్బందికి మంగళవారం సీపీ రివార్డులు అందజేశారు. ఈ సందర్భంగా షీ టీమ్స్, భరోసా కేంద్రాలను సందర్శించారు. అనంతరం, సీసీఎస్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీ మాట్లాడుతూ, 2023-24వ సంవత్సరానికి సైబర్ క్రైమ్ పోలీసులు దేశంలోని వివిధ రాష్ట్రాలలో తిరుగుతూ సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేశారని, బాధితుల సొమ్మును సైబర్ నేరగాళ్ల బ్యాంకు ఖాతాలలో ఫ్రీజ్ చేసి, న్యాయస్థానం ద్వారా బాధితులకు ఆ సొమ్మును తిరిగి ఇప్పించడంలో ఎంతో కృషి చేశారని సీపీ సైబర్‌క్రైమ్ పోలీసుల సేవలను కొనియాడారు. మహిళా భద్రతకు సంబంధించిన జూన్ 2023 నుంచి మహిళా పోలీసులు పనిచేస్తూ మహిళా సంబంధిత సమస్యలు, గృహ హింసకు సంబంధించిన కేసులలో బాధితులకు అండగా ఉంటున్నారని అభినందించారు. మహిళలను వేధించే పోకిరీలను షీ టీమ్స్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంటున్నదని, అలాంటి వారికి 2 నుంచి 10 రోజుల వరకు న్యాయస్థానాలు జైలు శిక్షలు, జరిమానాలు విధిస్తున్నాయన్నారు. భరోసా కేంద్రం బాధితులకు ఎంతో భరోసానిస్తూ వారికి అన్ని రకాలైన సేవలందిస్తున్నదన్నారు. మెడికల్, లీగల్, న్యాయపరమైన సేవలతో పాటు పరిహారం, పునరావాసం తదితర కార్యక్రమాలు చేపడుతూ బాధితులకు మేమున్నామని పూర్తి భరోసా నిస్తున్నారన్నారు. అన్ని విభాగాల నుంచి తమ వృత్తిలో ప్రతిభ కనబరిచే పీసీ నుంచి ఏసీపీ స్థాయి వరకు సిబ్బందిని గుర్తించి ప్రోత్సహిస్తామన్నారు. ఇందులో భాగంగా పోలీసులతో పాటు ప్రాసిక్యూటర్స్, డాక్టర్స్, మహిళా భద్రతా సిబ్బందిని సన్మానించారు.

ఓటింగ్ శాతం పెంచేలా..

ఇల్లు వీడండి.. ఓటు వేయండి

వినూత్న పద్ధతిలో ఓటర్లను చైతన్యవంతులను చేస్తున్న స్విప్

బొట్టు పెట్టి ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచిస్తున్న స్విప్ అధికారులు

మేడ్చల్, ఏప్రిల్ 16(నమస్తే తెలంగాణ): ఓటింగ్ శాతం పెంచేలా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో వినూత్న పద్ధతిలో స్విప్ కార్యక్రమం ద్వారా ఓటర్లను చైతన్యవంతులను చేస్తున్నారు. జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాలలో గత ఎన్నికలలో తగ్గిన ఓటింగ్ ప్రాంతాలను గుర్తించి ఓటింగ్ శాతం పెంచేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. స్విప్ కార్యక్రమంలో ఓటర్లు తప్పని సరిగా ఓటు హక్కును వినియోగించుకునేలా ఇంటింటికీ వెళ్లి 'ఉండమ్మా బొట్టు పెడతాను' అంటూ 'ఇల్లు వీడండి.. ఓటు వేయండి' అని మహిళలకు బొట్టు పెట్టి చెబుతున్నారు. 'ఓటు నీ భవిష్యత్తు, ఓటు హక్కును వినియోగించుకుందాం, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకుందాం' అంటూ స్విప్ ర్యాలీలు నిర్వహిస్తున్నారు. మీ కోసం పోలింగ్ కేంద్రంలో వేచి చూస్తామని చెబుతున్నారు.

థర్మో ఫిషర్ సైంటిఫిక్‌తో ఏఐసీ భాగస్వామ్యం

కుదిరిన ఇరు సంస్థల మధ్య ఒప్పందం

సిటీబ్యూరో, ఏప్రిల్ 16(నమస్తే తెలంగాణ): ప్రముఖ బయో ఇంక్యుబేటర్ థర్మోఫిషర్ సైంటిఫిక్ సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యూలర్ బయాలజీలోని అటల్ ఇంక్యుబేషన్ సెంటర్‌తో భాగస్వామ్యమైంది. బయో మెడికల్ పరిశోధనలు, బయో స్టార్టప్‌లకు ఫండింగ్ వంటి అంశాల్లో ఇరు సంస్థలు కలిసి పనిచేయనున్నాయి. ఆధునిక సదుపాయం, సెంటర్ ఫర్ ఇన్నోవేషన్, స్టార్టప్‌లలో శాస్త్రవేత్తల నైపుణ్యాలు, వ్యవస్థాపక చతురతను పెంపొందించే అవకాశాలతో అత్యాధునిక సాంకేతికతను సమకూర్చడం ఈ ఒప్పందం ద్వారా సాధ్యమవుతుంది. వైద్యారోగ్య సంరక్షణ, ఫార్మా, బయో టెక్నాలజీ రంగాల్లోని స్టార్టప్‌లకు సహకరించే థర్మోఫిషర్ సైంటిఫిక్ సంస్థతో కుదిరిన ఒప్పందం, పరిశోధన, ఆంత్రప్రెన్యూర్‌షిప్ వ్యవస్థలను ఎంతగానో ప్రభావితం చేస్తుందన్నారు. కొత్త ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకురావడానికి అవసరమైన సౌకర్యాలను ఏఐసీలోని స్టార్టప్‌లూ పొందే వీలుంది. అదే విధంగా సెల్ ఇన్‌సైట్, సీఎక్స్7 ఎల్‌జడ్ఆర్ ప్రో హై కంటెంట్ స్క్రీనింగ్ ప్లాట్‌ఫాం, కింగ్‌ఫిషర్ ఫ్లెక్స్ ఆటోమేటెడ్ న్యూక్లియక్ ప్యూరికేషన్ సిస్టమ్, ఈవీఓఎస్ ఎమ్7000 ఇమేజింగ్ సిస్టమ్‌తో పాటు, ల్యాబోరేటరీ ఫ్రీజర్లు, రిఫ్రిజిరేటర్లు వంటి అత్యాధునిక ఫ్లాట్ ఫారంలతో సహా పరిశోధనలకు అవసరమైన టెక్నాలజీ, సాంకేతికతను థర్మో ఫిషర్ ఈ సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ ద్వారా సమకూర్చనుంది. ఈ సాధనాలను ఉపయోగించి మాలిక్యూలర్ బయాలజీ, ప్రోటిన్ బయాలజీ, సెల్ బయాలజీ, సెల్ అనాలిసిస్ వర్క్ ఫ్లో వంటి అంశాల్లో మరింత వేగంగా పరిశోధనలు చేసేందుకు వీలుంటుందన్నారు. వినూత్న స్టార్టప్‌లను విస్తరించడమే లక్ష్యంగా సుస్థిరమైన పరిశోధన వ్యవస్థలను తీర్చిదిద్దేందుకు అటల్ ఇన్నోవేషన్ మిషన్‌తో కలిసి ఈ సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ ఏర్పాటు చేసినట్లుగా థర్మో ఫిషర్ ఇండియా శ్రీనాథ్ వెంకటేష్ తెలిపారు. కాగా, బయోటెక్నాలజీ స్టార్టప్‌లకు మద్దతునిస్తూ జరిగిన అతి పెద్ద ఒప్పందాల్లో ఒకటిగా థర్మోఫిషర్ - ఏఐసీ నిలిచిందని సీఈవో డాక్టర్ మధుసూదన్ రావు వివరించారు.

విద్యార్థులపై ప్రైవేట్ జులుం

ప్రైవేట్ విద్యా సంస్థలు - యజమాన్యాల దాష్టీకం

ఫీజులు కట్టలేదని పిల్లలను పరీక్షలు రాయనివ్వని వైనం

విద్యార్థులను బయటకు వెల్లగొడుతున్న టీచర్లు

విద్యాశాఖ అధికారుల ఆదేశాలు సైతం బేఖాతర్

బడంగ్‌పేట, ఏప్రిల్ 16: ప్రైవేట్ పాఠశాలలు, విద్యా సంస్థల యజమాన్యం విద్యార్థుల పై జులుం చెలాయిస్తున్నారు. ఫీజులు కట్టడం లేదని విద్యార్థులను స్కూల్ బయటకు గెంటేస్తున్నారు. ఇష్టాను సారంగా ఫీజులు పెంచడమే కాకుండా విద్యార్థుల తల్లిదండ్రులను బెదిరిస్తున్నట్లు ఆరోపణలు నిత్యం వస్తున్నాయి. బాలాపూర్ మండల పరిధిలో అనేక పాఠశాలల నుంచి విద్యాధికారులకు ఫిర్యాదులు వస్తున్నాయి. పాఠశాలలో అడ్మిషన్లు తీసుకునేటప్పుడు కొంత ఫీజు తగ్గింపు ఇస్తామని నమ్మబలుకుతున్నారు. లాస్టులో ఫీజు మాఫీ చేస్తామని దాట వేసుకుంటూ వస్తున్నారు. చివరకు తగ్గిస్తామన్న ఫీజును కూడా ముక్కు పిండి వసూలు చేస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తల్లిదండ్రులపై ఒత్తిడి చేయకుండా విద్యార్థుల పై ఫీజుల భారం వేస్తున్నారు. చాలా పాఠశాలల్లో ఫీజులు చెల్లించని విద్యార్థులను స్కూల్ బయట నిలబెట్టడం వంటి ఘటనలు తరచుగా జరుగుతున్నాయి. కొన్ని పాఠశాలల యజమానులు తమకు రాజకీయ పలుకుబడి ఉందని, ఏం చేసుకుంటారో.. చేసుకోమని విద్యార్థుల తల్లిదండ్రులను బెదిరిస్తున్నట్లు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. విద్యను వ్యాపారమయంగా మార్చుకొని ప్రభుత్వ నిబంధనలు గాలికి ఒదిలేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు మండి పడుతున్నారు. ఆయా విద్యా సంస్థల్లో చేర్చుకున్నప్పుడు ప్రశాంతంగా మాట్లాడిన పాఠశాలల యజమానులు అడ్మిషన్లు తీసుకున్న తర్వాత చుక్కలు చూపిస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రస్తుతం పరీక్షలు నడుస్తున్నాయి. ప్రైవేట్ పాఠశాలల యజమానులకు ఇప్పటికే విద్యాశాఖ అధికారులు మందలించినప్పటికీ ప్రైవేట్ పాఠశాలల యజమానుల వ్యవహార శైలి మారడం లేదని విద్యార్థులు తల్లిదండ్రులు మండిపడుతున్నారు. గతంలో ఇలాంటి పరిస్థితిలేదని ప్రభుత్వం మారిన తర్వాత ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. కొన్ని ప్రైవేట్ విద్యా సంస్థలు, పాఠశాలల యజమాన్యాలు మా ప్రభుత్వం వచ్చింది ఏం చేస్తారో.. చేసుకోండి? మీకు దిక్కున్న చోట చెప్పుకోండని ఇష్టారాజ్యంగా సమాధానం ఇస్తున్నట్టు తెలిసింది. నిబంధనలను ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఇప్పటికే అనేక పాఠశాలలపై విద్యార్థి సంఘాల నాయకులు ఫిర్యాదులు చేశారు.

ఫిర్యాదులొస్తున్నాయి: ఎంఈవో కృష్ణయ్య

ఫీజులు కట్టని వారిని పరీక్షలు రాయనివ్వడం లేదని, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. ఇప్పటికే చాలా విద్యా సంస్థలు, పాఠశాలల వ్యవహార శైలిపై పై అధికారులకు నివేదికలు ఎప్పటికప్పుడు అందిస్తున్నాం. విద్యార్థులు ఫీజు కట్టక పోతే పరీక్షలు రాయకుండా చేయడం మంచి పద్ధతి కాదు.

లోక్‌సభ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

విజుబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వండి

కమిషనరేట్ అధికారులతో సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి

సిటీబ్యూరో, ఏప్రిల్ 16(నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో చేపట్టాల్సిన భద్రత ఏర్పాట్లు, జాగ్రత్తలపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీ ఇతర అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ, లోక్‌సభ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలన్నారు. ఎన్నికల సంఘం నియంత్రణలో క్రమశిక్షణతో పనిచేయాలన్నారు. ఎన్నికలలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలన్నారు. కమిషనరేట్ పరిధిలో అవసరమైన అన్ని చోట్ల చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, అక్రమంగా తరలించే డబ్బు, మద్యం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే ఇతరత్రా వస్తువులను ఎక్కడికక్కడ కట్టడి చేయాలన్నారు. ఎన్నికల విధులకు సంబంధించిన నిర్దిష్టమైన సూచనలను కింది స్థాయి సిబ్బందికి అందించాలన్నారు. క్షేత్ర స్థాయిలో విధులు నిర్వర్తించే సిబ్బందికి కూడా ఎన్నికల నిబంధనల మీద అవగాహనను కల్పించడానికి సిబ్బందితో సమావేశాలను కూడా ఏర్పాటు చేసుకోవాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఇతర ప్రభుత్వ విభాగాలతో సమన్వయంతో పనిచేస్తూ, గతంలో ఎన్నికల సందర్భంగా ఎదురైన సమస్యలను గుర్తించి వాటిపై నిఘా పెంచాలన్నారు. రౌడీ షీటర్స్, సస్పెక్ట్ షీట్, హిస్టరీ షీట్ ఉన్న వారిని బైండోవర్ చేయాలన్నారు.

సమీక్షలో మాట్లాడుతున్న సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, చిత్రంలో అధికారులు

బాల సాహిత్య సమ్మేళనంలో పేర్లు నమోదు చేసుకోండి

తెలుగు యూనివర్సిటీ, ఏప్రిల్ 14: తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో మే 29, 30 తేదీలలో బాల సాహిత్య సమ్మేళనం నిర్వహించనున్నట్లు పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి తెలిపారు. పాఠశాల స్థాయిలో తెలుగు భాషా వికాసం, బడి పిల్లల్లో రచనాభిరుచిని పెంపొందించడం, పత్రికల్లో బాలల రచనలకు ప్రచురణావకాశాలు, కథలు చెప్పడంలో మెలకువలు, సంగీతం, నృత్యం నాటకం, చిత్రలేఖనం, శిల్పం తదితర లలిత కళలపైన ప్రాథమిక అంశాలపై అవగాహన సదస్సులు, గోష్టులు జరుగుతాయని పేర్కొన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన పాఠశాల విద్యార్థులు, తెలుగు ఉపాధ్యాయులు, బాల సాహితీవేత్తలు, బాలల కోసం రచనలు చేస్తున్న వారు ఈ సదస్సులో పాల్గొంటారని వెల్లడించారు. రెండు రోజుల పాటు జరగనున్న సదస్సులకు ప్రతినిధులుగా పాల్గొనాలనుకునే వారు ఫోన్ నం: 96037 27234లో సంప్రదించి ఈ నెల 30వ తేదీలోగా వివరాలతో పేరు నమోదు చేసుకోవాలని పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జుర్రు చెన్నయ్య తెలిపారు.

ఔట్స్ సోర్సింగ్ జీవితాలు దుర్భరం

రాష్ట్ర వ్యాప్తంగా 269 మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 4,300 మంది నాన్ టీచింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్, సెక్యూరిటీ, హౌజ్ కీపింగ్ తదితర విభాగాల్లో పనిచేస్తున్న వారంతా తమపై వివక్ష చూపుతున్నారని, చాలీ చాలని వేతనాలను సైతం మధ్యవర్తులైన ఏజెన్సీల ద్వారా తీసుకోవాల్సి వస్తుందని తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ (మైనార్టీ) ఔట్స్ సోర్సింగ్ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజ్ మహ్మద్, రేష్మా పర్వీన్, ఉద్యోగులు వాపోయారు. తమ జీవితాలు దుర్భరమయ్యాయని, నేరుగా తమకు వేతనాలు చెల్లించాలని నినదించారు. రెగ్యూలర్ సిబ్బందితో సమానంగా, ఏజెన్సీల ప్రమేయం లేకుండా నేరుగా ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు రఫీ, అబ్దుల్ షఫీ, లతీఫ్ పాల్గొన్నారు.

- ఖైరతాబాద్

ఆటోమేషన్‌తో నాణ్యమైన విద్యుత్

వేసవి డిమాండు తట్టుకునేలా అన్ని ఏర్పాట్లు

సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

కళ్యాణ్‌నగర్‌లో స్కాడా, సబ్ స్టేషన్ తనిఖీ

సిటీబ్యూరో, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): విద్యుత్ సరఫరా వ్యవస్థలో ఆటోమేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడంపై దృష్టి సారించామని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ అన్నారు. మంగళవారం బంజారాహిల్స్ సర్కిల్ కళ్యాణ్‌నగర్‌లోని సబ్ స్టేషన్‌లో విద్యుత్ సరఫరా తీరును, స్కాడా కేంద్రాన్ని ఆయన సర్కిల్ ఎస్ఈ చంద్రశేఖర్‌తో కలిసి పరిశీలించారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా జరగాలంటే డిస్కం పరిధిలోని నెట్ వర్క్ మొత్తాన్ని ఆటోమేషన్ చేయాల్సి ఉంటుందని, ఈ ప్రక్రియను పూర్తి చేసి కొత్తగా ఆధునీకరించిన మొబైల్ యాప్‌తో అనుసంధానం చేయనున్నామని సీఎండీ తెలిపారు. ఏటా విద్యుత్ డిమాండు గణనీయంగా పెరుగుతోందని, దాన్ని దృష్టిలో పెట్టుకొని సర్కిళ్ల వారీగా సబ్ స్టేషన్ల ఏర్పాట్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్స్, కొత్తగా లైన్లను ఏర్పాటు చేసుకోవాలని సర్కిళ్ల ఉన్నతాధికారులకు సూచనలు చేశామన్నారు. వేసవి కార్యాచరణలో భాగంగా ఏయే సర్కిళ్లలో ఎలాంటి మౌలిక వసతులు కల్పించారన్న విషయాలను ఆరా తీశారు. ముఖ్యంగా లోడు ఏ ప్రాంతంలో ఎక్కువగా ఉంది, ఇందుకు అనుగుణంగా ఎలాంటి ఏర్పాట్లు చేయాలన్న దానిపై నివేదికలు ఇవ్వాలని సూచించారు.

ఉన్నతాధికారులు సూచనలు..

సబ్ స్టేషన్ తనిఖీలో భాగంగా లోడ్ ఎంత ఉంది? అదనంగా పెరిగితే ఎలాంటి ఏర్పాట్లు చేయాలని ఎలక్ట్రికల్ ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. లాగ్ బుక్ తనిఖీ చేసి.. 33 కేవీ, 11 కేవీ ఫీడర్ల పరిధిలో జరిగిన అంతరాయాలు, వాటి సమయం ఎంత మేర ఉందని చూశారు. సబ్ స్టేషన్లలో ఉన్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్ పనితీరును, బ్రేకర్స్, రిలే పరికరాలు వంటి వాటిని ప్రత్యేకంగా పరిశీలించారు. సబ్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు భద్రతా ప్రమాణాలను పాటించాలని, హెల్మెట్‌లను, ఎర్త్ రాడ్‌లను, ఇతర భద్రతా వస్తువులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

బంజారాహిల్స్ సర్కిల్ కళ్యాణ్‌నగర్‌లోని సబ్ స్టేషన్‌లో విద్యుత్ సరఫరా తీరును తనిఖీ చేస్తున్న సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

ఎంఎల్ఆర్ఐటీలో ముగిసిన స్పోర్ట్స్ మీట్

సిటీబ్యూరో, ఏప్రిల్ 16(నమస్తే తెలంగాణ): ఎంఎల్ఆర్ఐటీలో రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్ విజయవంతంగా ముగిసింది. నగరంలోని ఎంఎల్ఆర్ఐటీ కళాశాల వేదికగా నిర్వహించిన ఈ పోటీలకు రాష్ట్ర నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీల్లో ఎంఎల్ఆర్ఐటీ కళాశాల అత్యుత్తమ ఫలితాలను సాధించి ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను గెలుచుకున్నది. ఎంఎల్ఆర్ గ్రూప్స్ చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, ఫౌండర్ సెక్రటరీ మర్రి రాజశేఖర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డా. కే.శ్రీనివాసరావు, అరుంధతి హాస్పిటల్ డైరెక్టర్ ధీరజ్ రెడ్డి, ప్రారంభ, ముగింపు వేడుకల్లో పాల్గొన్నారు. విజేతలు, రన్నరప్‌లకు ట్రోఫీలు, నగదు బహుమతులను అందజేసి అభినందించారు.

ఎమర్జింగ్ టెక్నాలజీపై పట్టు సాధించాలి

జేఎన్టీయూహెచ్ సీఎస్ఈ హెచ్‌వోడీ డాక్టర్ కేపీ సుప్రీతి

మేడ్చల్, ఏప్రిల్ 16: ఎమర్జింగ్ టెక్నాలజీస్‌పై పట్టు సాధించాలని జేఎన్టీయూహెచ్ సీఎస్ఈ హెచ్‌వోడీ డాక్టర్ కేపీ సుప్రీతి సూచించారు. గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని నర్సింహా రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో స్కూల్ కంప్యూటర్ సైన్స్ ఆధ్వర్యంలో ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ అనే అంశంపై మంగళవారం జాతీయ స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఆమె మాట్లాడుతూ, యువత, ఇంజినీరింగ్ అధ్యాపకులు కార్పొరేట్ రంగంలో ముందుండాలి అంటే ఎమర్జింగ్ టెక్నాలజీలపై అవగాహనతో పాటు, పట్టును కల్గి ఉండాలన్నారు. డిజిటల్ మార్కెటింగ్, కృత్రిమ మేధ, సైబర్ సెక్యూరిటీ లాంటి సాంకేతిక పరిజ్ఞానం సమాజంలో మనిషి మేధస్సును పెంపొందించడంలో, సైబర్ నేరాల నుంచి తమ జీవితాలకు భద్రత కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. కళాశాల కార్యదర్శి జక్కుల త్రిశూల్ రెడ్డి, డైరెక్టర్ మోహన్ మాట్లాడారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న జేఎన్టీయూ సీఎస్ఈ హెచ్‌వోడీ సుప్రీతి

సదస్సులో 200 మందికి పై చిలుకు విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొని, ఎమర్జింగ్ ట్రెండ్స్‌పై ఉపన్యసించారు. కార్యక్రమంలో చైర్మన్ జక్కుల నర్సింహా రెడ్డి, కోశాధికారి త్రిలోక్ రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం, డీన్ రామసుబ్బారెడ్డి, సీఎస్ఈ ఎమర్జింగ్ హెచ్‌వోడీ పార్థ సారథి, సీఎస్ఈ హెచ్‌వోడీ సుజీత్, కన్వీనర్ పల్లెల దిలీప్ కుమార్ రెడ్డి, డీన్‌లు పురుషోత్తం, వెంకట్రావు, శ్రీనివాస రావు, గుజ్జుల సునీల్ కుమార్, రేవతి, నిరోషా, ముబీన్ తాజ్ పాల్గొన్నారు.

ఎస్సే ఆన్‌లైన్ పరీక్షకు జోయెల్ లక్ర

కీసర, ఏప్రిల్ 16: స్పాట్ అసెస్మెంట్ ఆన్‌లైన్ పరీక్షలో స్పాట్ 100లో అర్హత సాధించిన జోయెల్ లక్ర అనే విద్యార్థిని జూబ్లీహిల్స్ పాఠశాల యాజమాన్యం అభినందించారు. విక్రమ్ సారాభాయ్ సైన్స్ ఫౌండేషన్ వారు దేశ వ్యాప్తంగా 3వ తరగతి నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులకు సంవత్సరానికి ఒకసారి నిర్వహిస్తారు. అయితే, స్పాట్ ఆన్‌లైన్ పరీక్షలో రాంపల్లి దాయరలోని జూబ్లీహిల్స్‌లో 8వ తరగతి చదువుతున్న జోయెల్ లక్ర 100శాతం ఉత్తీర్ణత సాధించింది. ఫైనల్ పరీక్షకు ఎంపిక కావడంతో ఈ మేరకు మంగళవారం ఆ పాఠశాల యాజమాన్యం ఆ విద్యార్థి కోసం అభినందన సభను ఏర్పాటు చేసి, పాఠశాల చైర్మన్ హరిశ్చంద్ర ప్రసాద్ విద్యార్థికి రూ.10 వేల నగదును అందజేశారు.

రేవంత్‌ని మాదిగలు నమ్మే పరిస్థితి లేదు

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 16: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటల్ని మాదిగ జాతి ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్ అన్నారు. మాదిగలతో రేవంత్ వైరం కోరుకుంటే యుద్ధానికి మాదిగలు సిద్ధమేనని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి ప్రజల ముందు అబద్ధాలు చెప్పడం సరికాదని హితవు పలికారు. బౌద్ధనగర్ డివిజన్ పార్సిగుట్టలోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో గోవిందు నరేశ్ మాట్లాడారు. మాదిగలకు పార్లమెంట్‌కు వెళ్లేందుకు అవకాశం ఇవ్వనివాళ్లు వర్గీకరణ చేస్తామనడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. రెడ్లకు ఇచ్చిన పదవులు ఎన్ని? మాదిగలకు ఇచ్చిన పదవులు ఎన్ని? లెక్కలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి మాదిగలకు చేసింది తక్కువని, ఆయనకు మాదిగలు చేసిందే ఎక్కువని అన్నారు. మాలలు కుర్చీ లాక్కుంటారో.. లేదో.. కానీ, మాదిగలు మాత్రం పోరాడి కుర్చీ నుంచి దించుతారని చెప్పారు. రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్న 3 ఎస్సీ రిజర్వుడ్ ఎంపీ స్థానాలు, కంటోన్మెంట్ ఎస్సీ రిజర్వుడ్ ఎమ్మెల్యే స్థానాల్లో ఒకటి కూడా మాదిగలకు కేటాయించకుండా కాంగ్రెస్ పార్టీ ద్రోహం చేసిందని మండిపడ్డారు. ఇప్పటికే దీనిపై మాదిగ ప్రజలు ఆవేదనతో రగిలిపోతుంటే రేవంత్ రెడ్డి సోమవారం మాట్లాడిన మాటలు పుండు మీద కారం చల్లినట్లుగా ఉందని అభిప్రాయపడ్డారు. ఎస్సీ వర్గీకరణ కోసం సుప్రీం కోర్టులో ప్రభుత్వం నియమించిన ఉద్దండుడైన న్యాయవాది ఎవరో చెప్పాలని సవాల్ విసిరారు. మంద కృష్ణ మాదిగ జైలులో ఉన్నప్పుడు తానే న్యాయవాదిని పెట్టానని రేవంత్ అంటున్నారని, కానీ మంద కృష్ణ బెయిల్‌కు రేవంత్‌కు సంబంధం లేదని వివరించారు. జనాభా ప్రాతిపదికన మాదిగలు, మాలలు, ఉపకులాలకు ప్రాతినిధ్యం కల్పిస్తామని, సామాజిక న్యాయం అమలు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో వాగ్దానం చేసిన కాంగ్రెస్ పార్టీ వంద రోజుల్లోనే ఆ హామీకి సమాధి కట్టిందని దుయ్యబట్టారు. చేసిన తప్పులను సరిదిద్దుకుని ఎంపీ స్థానాల్లో మాదిగలకు ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మాదిగలను కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగకూడదన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సోమశేఖర్, ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్, నాయకులు నలిమెల విజయరావు, బైరపోగు శివ, రఘు, రాజశేఖర్, శివప్రసాద్, సాయికుమార్, మహేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.